7న కార్పొరేట్ ఇన్నోవేషన్ కాంక్లేవ్-2025

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీహబ్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన కార్పొరేట్ ఇన్నోవేషన్ కాంక్లేవ్(సీఐసీ-2025) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అతిథులుగా సైయింట్ సంస్థ బోర్డు డైరెక్టర్, వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి, యూనికార్న్ వ్యవస్థాపకుడు రోహిత్ చెన్నమనేని, దొడ్ల డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ రెడ్డి, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. కార్యక్రమంలో 300కు పైగా కార్పొరేట్ ప్రతినిధులు, 100కు పైగా స్టార్టప్‌లు, 100కు పైగా ఎకోసిస్టమ్ భాగస్వాములు పాల్గొంటారు. ఈ సందర్భంగా స్టార్టప్‌లకు రూ.1,200 కోట్లను ఫండింగ్ చేసే అవకాశం ఉంది.

దేవిక మృతదేహం అప్పగింత

గచ్చిబౌలి: వరకట్న వేధింపులతో పెళ్లైన ఆరు నెలలకే తనువు చాలించిన కమలాపురం దేవిక(25) మృతదేహానికి మంగళవారం ఉస్మానియా ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వికారాబాద్ జిల్లా తోర్‌మామిడిలో దేవిక అంత్యక్రియలు చేశారు. కాగా దేవిక తోటి ఉద్యోగి సద్గుర్తి శరత్‌చంద్రను ప్రేమించింది. పెద్దల అంగీకారంతో గోవాలో పెళ్లి చేసుకొని రాయదుర్గంలోని ప్రశాంత్‌హిల్స్‌లో కాపురం పెట్టారు. ఐదు లక్షల నగదు, 10 తులాల బంగారం కట్నంగా ఇచ్చానని తల్లి రామ లక్ష్మీ పేర్కొంది. అదనపు కట్నం విషయంలో గొడవలు తారాస్థాయికి చేరడంతో మనస్తాపానికి గురైన దేవిక ఆత్మహత్య చేసుకుంది. దేవిక తరచుగా రీల్స్ చేస్తుంటుందని, ఇన్‌స్టాగ్రాంలో మూడు లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు సద్గుర్తి శరత్ చంద్రను అరెస్ట్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో వైద్యపరీక్ష చేస్తున్న వైద్యులు

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఎంఎన్ఆర్ ఆస్పత్రి సౌజన్యంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం స్వచ్ఛంద సంస్థ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వయంపాలనా దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంత బాధ్యతాయుతమైనదో తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



గచ్చిబౌలి: అనాథ పిల్లలకు టీజీఎస్ఎస్‌పీ కొండాపూర్ బెటాలియన్ పోలీసులు సరుకులను పంపిణీ చేశారు. మంగళవారం బి కంపెనీ యాన్యువల్ రిఫ్రెషర్స్ కోర్స్‌లో భాగంగా మోతీనగర్‌లోని శ్రీ ఆదర్శ ఫౌండేషన్‌ను సందర్శించారు. అసిస్టెంట్ కమాండెంట్ సీతారాం చేతుల మీదుగా దుస్తులు, రైస్ బ్యాగ్, ఫ్రూట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రెక్కింగ్



రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో విద్యార్థులు 'మౌంటేన్ ట్రెక్కింగ్' నిర్వహించారు. అఖిల భారత విద్యార్థి పరిషత్, స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్(ఎస్ఎఫ్‌డీ) సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు హైరాక్స్ వరకు వెళ్లారు. అక్కడి కొద్దిసేపు సేద తీరారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.





అసలే ఇరుకు రోడ్డు.. ఆపై డంపింగ్

హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ రోడ్డు - వాటర్ వర్క్స్ రిజర్వాయర్ వరకూ వాహనదారుల ఇక్కట్లు

చందానగర్: హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ ముందు ఉన్న రోడ్డు నుంచి వాటర్ వర్క్స్ రిజర్వాయర్ల రోడ్డు పక్కన వ్యర్థాల డంపింగ్, కట్టెల దుకాణాలతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయవద్దని ప్రత్యేకంగా స్థలాలు ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ అధికారులు తెలుపుతున్నా హఫీజ్‌పేట్‌లో మాత్రం రోడ్డు పక్కన వేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో సాక్షిలో పలు మార్లు కథనాలు రాసినప్పుడు రోడ్డును విస్తరించారు. కానీ ఇష్టానుసారంగా రోడ్డు పక్కన వ్యర్థాలు



హఫీజ్‌పేట్ జలమండలి ప్రహరీ వద్ద రోడ్డు పక్కన వ్యర్థాలు, చెత్త చెదారం



ఆర్టీసీ కాలనీ రైల్వేట్రాక్ పక్కనే భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్

పారబోస్తున్నారు. కట్టెల వ్యాపారం చేస్తుండడంతో రాత్రి సమయాలలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మరోపక్క జలమండలి ప్రహరీగోడను ఆనుకొని ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో బాటు ఇరుకుగా ఉంది. ఇక ఆర్టీసీ కాలనీ రైల్వేట్రాక్ పక్కనే వ్యర్థాలు డంపింగ్ చేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జలమండలి పక్క రోడ్డు విస్తరించాలని పలుమార్లు విన్నవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు, స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు విస్తరణ చేస్తే మియాపూర్, మదీనాగూడ, బొల్లారం తదితర ప్రాంతవాసులు హైటెక్‌సిటీకి వెళ్లేందుకు ట్రాఫిక్ సమస్యతో పాటు కొంత మేర దూరం తగ్గుతుంది. లింక్‌రోడ్డులో భాగంగా మంజీరారోడ్డు విస్తరణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కాగా హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ వద్ద ప్రతి ఆదివారం కల్వరి టెంపుల్‌కు వచ్చే భక్తులతో రోడ్డంతా కిక్కిరిసిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది.

వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలి



హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ ముందు రోడ్డుపైన కట్టెల స్క్రాప్ దుకాణాలతో పాటు భవన వ్యర్థాలు వేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలి. రోడ్డు పక్కన వ్యర్థాలు, చెత్త చెదారం వేయకుండా సిబ్బందిని నియమించాలి. -దత్తాత్రేయ, హఫీజ్‌పేట్

రోడ్డు విస్తరించాలి



హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌ను ఆజాదికా అమృత్ మహోత్సవం పేరిట అభివృద్ధి చేస్తున్న సందర్భంగా రైల్వే స్టేషన్ ముందు ఉన్న స్క్రాప్ దుకాణాలను తొలగించి రోడ్డును విస్తరించాలి.అలాగే జలమండలి ప్రహరీ గోడ పక్కన ఉన్న రోడ్డును కూడా విస్తరించాలి. - వీరభద్రం, ఓల్డ్ హఫీజ్‌పేట్

ఇంజనీర్లు అద్భుతాలను సృష్టించారు

- 'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు
- 'ఎస్కీ' ప్రాంగణంలో ప్రపంచ ఇంజనీరింగ్ దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: ప్రతి దేశం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలంటే ఇంజనీర్ల పాత్ర కీలకమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఇంజనీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఎస్కీ' ప్రాంగణంలో ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి అవసరమైన స్వచ్ఛ నీరు, సమర్థవంతమైన రవాణా, మౌలిక వసతుల పరిష్కారాలకు యువ ఇంజనీర్లు కృషి చేయాలన్నారు. వేల సంవత్సరాల ఈజిప్ట్ పిరమిడ్స్‌తో సహా వేలాది అద్భుతాలను ప్రపంచ వ్యాప్తంగా ఇంజనీర్లు సృష్టించారని ఆయన గుర్తు చేశారు. ఇంజనీర్లు, అధికారులు జి నరేష్, అనిత అగర్వాల్, డాక్టర్ సాగర్, సాయికిశోర్, సిహెచ్ తిలక్, శ్రీకాంత్, జ్యోతి, సౌమ్య, మోహన్, డాక్టర్ మోహన్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు అమర్‌నాథ్, శ్రీధర్‌బాబు, డాక్టర్ కృష్ణమోహన్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రకళ, డా. రాజారావు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ కాలనీలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



కాలనీలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



ప్రధాన రోడ్డులో వెలుగులు

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో ప్రధానరోడ్డుపై రూ.44.59 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను సోమవారం రాత్రి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రాత్రివేళ రోడ్లపై వాహనదారులు ఇబ్బందిపడకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ మల్లికార్జున్, డీఈ కవిత, సూపర్‌వైజర్ మహేష్‌రెడ్డి, రాజు, పవన్, నాయకులు, టీఎన్‌జీఓ కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మియాపూర్: మదీనాగూడ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5.30గంటల వరకు స్వర్ణపురి కాలనీ రోడ్డు నంబర్ 1-14, కృష్ణసాయి ఎన్‌క్లేవ్, జనప్రియ వెస్ట్ సిటీ, మక్తమహబూబ్‌పేట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్ : చందానగర్ సెక్షన్ పరిధి హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 1.00 గంట నుంచి సాయంత్రం 4.00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలోని మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ఏరియాలలో..
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ప్రకాష్‌నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో ..
- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, ప్రకాష్‌నగర్, వినాయక నగర్ ఏరియాలలో..

హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలో...

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో .. మధ్యాహ్నం 1.00 గంట నుంచి సాయంత్రం 4.00 వరకు విద్యుత్ ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో..యూత్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, వార్డ్ ఆఫీస్, రైల్వే స్టేషన్, గ్రీన్ బావర్చి ఏరియాలలో ..
- ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో.. ఆదిత్యనగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ఏరియాలలో ..

వేమనకాలనీ సెక్షన్‌లో...

మదీనాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు

- శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. శాంతినగర్, ఉషోదయా అపార్ట్‌మెంట్ రోడ్డు, ధర్మపురి టెంపుల్ రోడ్డు, దీప్తిశ్రీనగర్ రోడ్డు నెంబర్ 14 నుంచి 25 వరకు, ఆదర్శనగర్ ప్రాంతాలలో..
- సీబీఆర్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలో సీబీఆర్ ఎస్టేట్స్, క్రోమా భవనం వెనకాల, శ్రీ దుర్గ హోమ్స్, ఆంధ్ర బ్యాంక్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తయారీ సామర్థ్యం.. ఎగుమతులతో ఆర్థికవృద్ధి

రాయదుర్గం: దేశంలో తయారీ సామర్థ్యం, ఎగుమతులు పెంచడం, ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయడం ద్వారానే ఆర్థికవృద్ధి సాధ్యమని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహుగారి తేజ్ లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో 'మేక్ ఇన్ ఇండియా'పై డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి విద్యా, శిక్షణ సంస్థల వెబినార్‌లో దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడంలో ఎఫ్‌డీడీఐలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. దేశీయంగా ఉండే చర్మకారులకు ఇతర సంస్థల సహకారంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.

మా స్థలాల్లో కంచె వేయొద్దు

ప్రశాంత్‌నగర్ కాలనీవాసుల డిమాండ్

మియాపూర్: హుడా అనుమతులతో అభివృద్ధి చేసిన లేఅవుట్ స్థలాలను కాపాడుకుంటామని మియాపూర్ ప్రశాంత్‌నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కాలనీ స్థలాన్ని కూడా హుడా అధికారులు ప్రభుత్వ భూమి అని స్వాధీనం చేసుకుంటున్నారని వాపోయారు. నెల రోజుల నుంచి కంచె ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. హుడా అధికారులే లేఅవుట్ వేసేందుకు అనుమతులిచ్చి వారే మరలా స్వాధీనం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ భూమిపై కోర్టులో కేసు ఉన్నందున ప్రశాంత్ నగర్ కాలనీ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు ఈ భూములను కాపాడుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి



సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమా దీపిక తదితరులు

శేరిలింగంపల్లి: ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఉమా దీపిక తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో ఆశాలు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్ఎన్ శ్యామల, ఎస్ఎస్‌కే మేనేజర్ మంజుల, ఫీల్డ్ వర్కర్ అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌లో 25 శాతం రాయితీ

- ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి
- చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు 25 శాతం రాయితీని పొందవచ్చని, దాని కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార ప్లాట్లు, లేఔట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరోసారి లే అవుట్ రెగ్యులైజేషన్ (ఎల్ఆర్ఎస్) పథకాన్ని ప్రకటించిందని, దీనిపై 25 శాతం రాయితీ ఇస్తుందన్నారు. సర్కిల్ పరిధిలో 1500 మంది దరఖాస్తుదారులు ఈ నెల 31వ తేదీ వరకు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ నాగిరెడ్డి, టీపీఎస్‌లు శ్రీనివాస్‌రెడ్డి, చైన్‌మెన్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, న్యాక్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

పన్ను ఎగవేతదారులపై ప్రత్యేక దృష్టి

చందానగర్ సర్కిల్ కార్యాలయంలో డీసీ మోహన్ రెడ్డి రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను లక్ష్యంగా పన్ను ఎగవేతదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టాప్ డిఫాల్టర్లకు వారెంట్‌లు జారీ చేయాలన్నారు. నివాస భవనాల పేరుతో అనుమతి తీసుకొని వ్యాపార సముదాయాలుగా ఉపయోగిస్తున్న భవనాల యజమానులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ మహేందర్ రెడ్డి, కృష్ణ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓస్ కాలనీలో 14 భవనాలు సీజ్



పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

గచ్చిబౌలి: నిబంధనలు పాటించకుండా అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించిన భవనాలను శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేస్తున్నారు. టీఎన్‌జీఓస్ కాలనీలో అక్రమంగా నిర్మించిన 14 భవనాలను మంగళవారం సీజ్ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరమణ ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఎస్ఐ శివపాల్ రెడ్డి , సిబ్బంది బందోబస్తు మధ్య భవనాలను సీజ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు నివాసం ఉండే టీఎన్‌జీఓస్ కాలనీలో రెండు లేదా మూడు అంతస్తులకు అనుమతి తీసుకొని ఆరు, ఏడు అంతస్తులు నిర్మించడం గమనార్హం. పలుమార్లు అధికారులు హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేసినా భవన యజమానులు పట్టించుకోకపోవడంతో 461/ఎఫ్ జీహెచ్ఎంసీ యాక్ట్-1955 ప్రకారం భవనాలను సీజ్ చేసినట్లు ఏసీపీ వెంకటరమణ తెలిపారు.

ప్రపంచంలో అలజడి, అశాంతి నెలకొంది

- ఆధ్యాత్మిక చింతన, జీవన సరళిలో మార్పు సరైన పరిష్కారం
- మత గురువు ఆచార్య దేవ్ మురారి బాపూజీ



ధ్వజారోహణ కార్యక్రమంలో ఆచార్య దేవ్ మురారిబాపూజీ

రాయదుర్గం: ప్రపంచంలో ప్రస్తుతం అలజడి, అశాంతి వ్యాప్తి చెంది ఉన్నాయని ఉత్తరప్రదేశ్ మధురా బృందావనం ప్రపంచ విఖ్యాత మత గురువు, అంతర్జాతీయ ధర్మాచార్య ఆచార్య దేవ్ మురారి బాపూజీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శివ పరమాత్మ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనుషులలో వెలితి ఎక్కువ అవుతోందని, ఆధ్యాత్మిక చింతన, జీవన సరళిలో మార్పు దీనికి సరైన పరిష్కార మార్గమని సూచించారు. బ్రహ్మకుమారీస్ సేవలు, బోధనలు ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. శివపరమాత్మ జ్ఞానం అందరినీ కాపాడుతుందన్నారు. నేటి ప్రపంచంలో అందరూ ఆధ్యాత్మికతవైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థల హైదరాబాద్ శాఖల ఇన్‌చార్జీ రాజయోగిని బికె కుల్‌దీప్ దీదీ, ప్రతినిధులు బికె అంజలి, మౌంట్ అబూ ప్రతినిధులు చంద్రేశ్, శ్రీకాంత్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కొత్తగూడ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోనె సురేష్

గచ్చిబౌలి: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలను నిలపాలని గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోనె సురేష్ సూచించారు. మంగళవారం కొత్తగూడ, గచ్చిబౌలి జంక్షన్లలో ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో, డ్రైవర్ వివరాలను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటో నంబర్ అన్ని వైపుల నుంచి కనిపించేలా పెట్టాలన్నారు. ఆటో డ్రైవర్లు డ్రెస్ కోడ్‌ను పాటించాలని, రోడ్డు పక్కన మాత్రమే ఆటోలను నిలపాలని సూచించారు. బస్టాప్‌లు, రోడ్లపై ఆటోలను నిలిపితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆయా డివిజన్‌లలో నెలకొన్న సమస్యలు, పెండింగ్ పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు .శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, కూకట్‌పల్లి సర్కిళ్ల పరిధిలో ఆయా డివిజన్‌లలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం, చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పలు సూచనలు ఇచ్చారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రజల సౌకర్యార్థం ప్రథమ ప్రాధాన్యతగా పనులు చేపట్టాలని, కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ అధికారులు ఈఈ దుర్గాప్రసాద్, ఈఈ కెవియస్ రాజు, ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈలు ఆనంద్, విశాలాక్షి, దుర్గా ప్రసాద్, రమేష్, నిఖిల్, ఏఈలు జగదీష్, భాస్కర్, ప్రతాప్, ప్రశాంత్,సంతోష్, సంతోష్ రెడ్డి,రాజీవ్, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడాలి



వన్యప్రాణుల గురించి వివరిస్తున్న టీజీఎఫ్‌డీసీ అధికారులు

గచ్చిబౌలి: వన్యప్రాణులను కాపాడాలని, అవి కనుమరుగయితే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఏకో టూరిజం) రంజిత్‌నాయక్ అన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్, మంచిరేవులలోని ట్రెక్ పార్క్‌లలో వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహించారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండే వన్య ప్రాణులు, వాటి అరుపులు, జీవన విధానం, అరుదైన చెట్లపై కామారెడ్డి జడ్‌పీహెచ్ఎస్, నాగర్ కర్నూల్ కేజీబీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బొటానికల్ గార్డెన్‌లోని కాక్టస్ గార్డెన్, మూలికా ఔషధ వనం, ఆర్కేరియం, ఫెర్నేరియం, నెపంథస్ మొక్కల గురించి డాక్టర వీర కిశోర్ వివరించారు. సీతాకొక చిలుకల వనం, రబ్బర్ వనం, ఇంద్ర ధనుస్సు వనం, పేపర్ గార్డెన్ తదితర థీమ్ పార్క్‌లను విద్యార్థులకు చూపించారు. అంతరించిపోతున్న వన్య ప్రాణులపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సభ్యులు విషం లేని పాముల గురించి వివరించారు. ట్రెక్‌పార్క్‌లో ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను వాలంటీర్లు తొలగించారు.కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ, ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.